క్లుప్తంగా

శ్రీ లక్ష్మినరసింహ స్వామికి అభిషేకం



ఊయల సేవలో భక్తులకు దర్శనం ఇస్తున్న స్వామి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా స్వామి వారిని ఇత్తడి ఊయల ఉంచి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. కానుకలు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితం యువతకు ఆదర్శం

మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్



శంకర్‌పల్లి: కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

శంకర్‌పల్లి: యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. శనివారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మహనీయుల అడుగు జాడల్లో నడుచుకొని, మంచి ప్రయోజకులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అశోక్, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కడ్తాల: మక్తమాధారం గ్రామంలో కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి, గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తిభావం పెంపొందుతుందని, ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ మంజుల, మార్కెట్ డైరెక్టర్ నర్సింహగౌడ్, నరేశ్‌గౌడ్, చెన్నయ్య, యాదగిరి, మల్లేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

నత్తనడకన 'విస్తరణ'



వాహనాలు వెళ్తుండగా దుమ్మురేగుతున్న తుర్కయంజాల్ రోడ్డు

తుర్కయంజాల్: సాగర్ రహదారి నుంచి తుర్కయంజాల్ మీదుగా నాదర్‌గుల్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం కొనసాగుతుంది. దీంతో గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. రూ.16 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పాటు అధికారుల అలసత్వం తోడవ్వడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశించినా అధికారుల్లో చలనం కనిపించడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై సాక్షి మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్‌ను వివరణ కోరగా నాదర్‌గుల్ వైపు నుంచి పనులు కొనసాగుతున్నాయని, పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపడుతామని తెలిపారు.

నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు పార్వతిపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి గణపతిపూజ, నవగ్రహ మండపారాధన, హోమం, గజారోహణం, రుద్రాభిషేకంపార్వతిపరమేశ్వరులకల్యాణాన్ని నిర్వహిస్తారు.

విద్యా నిలయంగా మహేశ్వరం

- ప్రభుత్వ మెడికల్ కాలేజీ, లా కళాశాల మంజూరు
- మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి
- ప్రతిపక్షాల విమర్శలు తగవు
- జెడ్పీటీసీ జంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా సీఎం కేసీఆర్ చొరవతో మంత్రి సబితారెడ్డి తీర్చిదిద్దుతున్నారని జెడ్పీటీసీ జంగారెడ్డి కొనియాడారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుకూరుకు లా కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతనంగా రెండు లా కళాశాలలు మంజూరు కాగా అందులో ఒకటి కందుకూరుకు కేటాయించడం శుభపరిణామమన్నారు. మంత్రి ముందు చూపుతో ఇప్పటికే ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైయిందని, డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నిక్ కళాశాలలు, గురుకులాలు ఏర్పాటయ్యాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు విమర్శలు మానుకుని అభివృద్ధిని చూడాలన్నారు. మరోసారి సబితారెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిలు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ ఇందిరాదేవేందర్, డైరెక్టర్లు దేవీలాల్, పాండురంగారెడ్డి, మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజు, సదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల రోడ్లు పరిశీలన

బడంగ్‌పేట్: గణేశ్ శోభాయాత్ర సాగే రోడ్లకు మరమ్మతులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాలని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర సంబంధించిన రోడ్లను శనివారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. బాలాపూర్ గణనాధుని శోభయాత్ర సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వసంత, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు మనోహర్, జైహింద్, బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నిరంజన్‌రెడ్డి, డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, తదితరులున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

బాలాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లతో పాటు స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.



బాలాపూర్ రోడ్డును పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

జీపీలకు దీటుగా తండాల అభివృద్ధి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: గిరిజన తండాలను గ్రామ పంచాయతీలకు దీటుగా అభివృద్ధి చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చెప్పారు. రోడ్లకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా శనివారం బీఆర్ఎస్ గంగారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గిరిజన తండాకు బీటీ, సీసీరోడ్లు నిర్మిస్తామని చెప్పారు. మహేశ్వరం, కందుకూరు మండలాల తండాల్లో బీటీరోడ్ల నిర్మాణానికి రూ.11.65 కోట్ల నిధులు మంజూరు చేశామని, గతంలో మంజూరైన రూ.9.41 కోట్లతో చేపట్టిన రోడ్ల పనులు కొనసాగుతున్నాయని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవి నాయక్, పార్టీ గంగారం అధ్యక్షుడు పాండునాయక్, నాయకులు ఠాగూర్‌నాయక్, దేవేందర్, దేవ, రాజేందర్, అర్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కడ్తాల్: ఈ నెల 11వ తేదీన లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు లయన్స్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, పీఆర్‌ఓ పాషా శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఎంపికైన ఉపాధ్యాయులు వీరే..

మల్లయ్య (ఎస్‌జీటీ, పిల్లిగుండుతండా), భీముడు (జెడ్పీహెచ్ఎస్, పీఆటీ ముద్విన్), బాలేశ్వరరావు (ఎస్ఏ, రావిచేడ్ ఉన్నత పాఠశాల), భార్గవి(జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల ఆమనగల్లు), వెకటయ్య(ఎంపీపీఎస్, ఆమనగల్లు), పద్మప్రియా (ఎస్జీటీ, పోలేపల్లి),శంకర్ (ఎస్ఏ, పడకల్ ఉన్నతపాఠశాల), సురేశ్‌కుమార్‌రెడ్డి(ఎస్జీటీ, ఎంపీపీఎస్, దేవునిపడకల్), రవికుమార్(జెడ్పీహెచ్ఎస్, వెల్దండ), గోపాల్ (ఎస్జీటీ, అజిలాపూర్), కవిత(ఎస్జీటీ,చంద్రయాన్‌పల్లి) సుజాత(జెడ్పీహెచ్ఎస్, ఇర్విన్)తో పాటు తదితరులున్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలోని పోలేపల్లి, కొత్తకుంటతండా, అంకమోనికుంటకు చెందిన బీజేపీ బూత్ కమిటీలను నియమించారు. బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్, బీజేవైఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బూత్ కమిటీలను నియమించారు. పోలేపల్లి, కొత్తకుంటతండా బూత్ బీజేపీ ప్రధాన కార్యదర్శులుగా కట్ట సైదులును ఎన్నుకున్నారు.

బీజేపీ నిరసన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా నుంచి శంకరకొండతండా రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదని ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మేడిగడ్డతండా ప్రజలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండెసాయి, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు శిక్షణా సదస్సు

కడ్తాల్: హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కల్యాణ మండపంలో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల, బ్లాక్ కాంగ్రెస్ నాయకులతో సదస్సు నిర్వహించారు. సమావేశానికి కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కల్వకుర్తి బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు బీచ్యా నాయక్ , ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

కొనసాగుతున్న పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు, కమిటీ సభ్యులు

మహేశ్వరం: సిరిగిరిపురం గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ పూజలు శనివారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, వేదపారాయణం, రుద్ర, దేవి, జలాధివాసంగ హోమం, ధ్యానాధివాసం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, లలిత హోమం, శయ్యాధివాసం, యంత్రార్చన, విశేష పూజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాసుల సురేశ్, ఉప సర్పంచ్ లక్ష్మిపాండు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ఈదయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ చారి, సలహాదారులు వెంకటరమణారెడ్డి, కోశాధికారి అనిల్ గౌడ్, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను అడ్డం పెట్టుకుని కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న అర్జున్ తదితరులు

బడంగ్‌పేట్: దళితులను అడ్డం పెట్టుకుని తనపై కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో 493 జీవో ప్రకారం బడంగ్‌పేటలో దళితులు, బీసీలతో పాటు పేదలకు 60 గజాల చొప్పున పట్టాలిచ్చామన్నారు. అయితే స్థానికులు గుడ్ల శ్రీనివాస్, శ్రీనివాస్, ధన్‌రాజ్ మరికొంత మందిని కీలుబొమ్మలుగా తయారు చేసి రాజకీయ లబ్ధి కోసం తనపై కుట్రలు చేస్తున్నారని తెలిపారు. కుట్రలు చేస్తే కోర్టుకు వెళతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, జంగారెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, పవన్ తదితరులున్నారు.

సమసమాజ నిర్మాణమే ఇస్కఫ్ లక్ష్యం

- సంస్థ ఆశయాల సాధనకు కృషి
- మాజీ ఎంపీ అజీజ్ పాష



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ పాష

హుడాకాంప్లెక్స్: కుల, మతాల్లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) కృషి చేయడం అభినందనీయమని మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాష అన్నారు. శనివారం కొత్తపేటలోని ఇస్కఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇస్కఫ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. దేశంలో కొన్ని శక్తుల వలన ప్రజల్లో అభద్రతా భావం నెలకొందని, కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఈ శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఇస్కఫ్ రాష్ట్ర మహాసభ రిసెప్షన్ కమిటీ కన్వీనర్ గోపాల్, రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్, సీపీఐ శంకర్‌నగర్ శాఖ కార్యదర్శి శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు మునీర్‌పటేల్, నగర కార్యదర్శి నజీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాసభ

సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగే ఇస్కఫ్ తొలి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని మహాసభ రిసెప్షన్ కమిటీ కన్వీనర్ ఆర్.గోపాల్ పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి సాంబశివరావు, ఇస్కఫ్ జాతీయ కార్యదర్శి విజయ పదహరి, రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్‌లు హాజరవుతారని తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి



బీజేపీ కార్యాలయంలో టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

జక్కిడి ప్రభాకర్ రెడ్డి

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని వనస్థలిపురానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, రైల్వే బోర్డు మెంబర్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి శనివారం పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 1985లో సాహెబ్‌నగర్ బీజేపీ గ్రామ అధ్యక్షుడిగా, 1991లో ఎల్‌బీనగర్ పట్టణ బీజేపీ కార్యదర్శిగా, బీజేపీ మలక్‌పేట అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రెండు పర్యాయాలు, బీజేపీ ఏపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం జిల్లా ఆహ్వానితుడిగా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నాయిని శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా సెక్రటరీ పంగ కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



కాలనీవాసులకు మొక్కలు అందజేస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం సేఫ్ ఎర్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ...ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్తను తరలించే సిబ్బందికి అందజేయాలని సూచించారు. అనంతరం ఆయన గాయత్రినగర్, బ్యాంక్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కాలనీలో పర్యటించి గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు, విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, వెలగని వీధిదీపాలు వంటి సమస్యలను పరిశీలించారు. త్వరలో ప్రత్యేక నిధులతో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ఆయన కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సేఫ్ ఎర్త్ అధ్యక్షుడు రవికాంత్, సభ్యులు శ్రీనివాస్ రంగారెడ్డి, వెంకటేష్, నాయకులు దుర్గాప్రసాద్, గణేష్, సులోచన, చిరంజీవి పాల్గొన్నారు.

8.16 కోట్లతో 'ఉపాధి'

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: రూ. 8.16 కోట్లతో ఉపాధి హామీ పనులను ఇబ్రహీంపట్నం మండలంలో చేసినట్లు ఎంపీపీ కృపేశ్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం కృపేశ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కూలీలకు కల్పించిన పనులు, ఖర్చులు, ఫారెస్టు, పంచాయతీరాజ్ శాఖలు చేపట్టిన పనుల తనిఖీ జరుగుతున్నట్లు తెలిపారు. కూలీలకు రూ. 4.39 కోట్లు, సామగ్రి కోసం 3.76 కోట్లకుపైగా ఖర్చులు చేసినట్లు తెలిపారు. దీనిపై సామాజిక బృందం గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ఏపీఓ తిరుపతాచారిలు పాల్గొన్నారు.

అవస్థలపురంగా వనస్థలిపురం: జక్కిడి



వనస్థలిపురం డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం అవస్థలపురంగా మారినా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రజాచైతన్య పాదయాత్రలో భాగంగా శనివారం ఆయన వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్, శ్రీకృష్ణానగర్, శక్తినగర్, వెంకటరమణ కాలనీ, శ్రీనివాసపురం, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ప్రశాంత్ నగర్, అభ్యుదయనగర్, ఎఫ్‌సీఐ కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వనస్థలిపురం హుడా ఆడిటోరియంను మినీ రవీంద్రభారతిగా మారుస్తానన్న ఎమ్మెల్యే హామీ నెరవేరలేదన్నారు. ఏరియా ఆసుపత్రిలో లిఫ్ట్ సౌకర్యం, వైద్య సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంటి జంగయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్యలు అలాగే ఉన్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు. నాయకులు ప్రకాష్, మోహన్‌రెడ్డి, భాను, రాణి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను పూజిద్దాం

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వదిలేద్దాం
- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- గణేశ్ నవరాత్రులకు సిద్ధమవుతున్న మండపాలు



మట్టి గణపతులతో జాగృతి అభ్యుదయ సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నాయి.... అప్పుడే కాలనీల్లో పండగ కోలాహలం మొదలైంది. కాలనీ సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలు, అపార్ట్‌మెంట్లలో గణనాథుడ్ని నిలబెట్టడానికి ఏర్పాటు చేస్తున్నారు. భారీ, వెరైటీ విగ్రహాలు, సినిమా సెట్టింగ్‌లను తలపించే మండపాలు వంటివి సిద్ధం చేసుకుంటున్నారు. అయితే పర్యావరణ హితంగా గణపతి ఉత్సవాలు జరుపుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు...

కాలనీలలో యువత పెద్దయెత్తున ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారైన భారీ గణపతి విగ్రహాలను తమ మండపాలలో ప్రతిష్టిస్తుంటారు. అయితే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ప్రతిష్టించవద్దని పర్యావరణ ప్రేమికులు సెలవిస్తున్నారు. రసాయనిక రంగులతో కూడిన విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తే ఆ నీరు కలుషితమవుతుందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే చాలా వరకు మార్పు వచ్చిందని, 50 శాతానికి పైగా మండపాలలో మట్టి విగ్రహాలనే ప్రతిష్టిస్తున్నారని వారు చెబుతున్నారు. నగరంలో అతి పెద్దదైన ఖైరతాబాద్ గణపతిని కూడా మట్టితో చేయించడం శుభ పరిణామమని వారు తెలిపారు.

జాగృతి ఆధ్వర్యంలో అలుపెరుగని ప్రయత్నం...

గత 15 సంవత్సరాలుగా వనస్థలిపురంలోని జాగృతి అభ్యుదయ సంఘం పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతోంది. ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించి ప్లాస్టిక్ కవర్లకు బదులు బట్ట సంచులు వాడాలని ప్రజల్లో అవగాహన కలిగిస్తోంది. అలాగే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలు ప్రతిష్టించాలని అలుపెరుగని ప్రయత్నం చేస్తోంది. జీహెచ్ఎంసీ సహకారంతో ఈస్ట్ జోన్ పరిధిలో మొట్టమొదటగా ఒక్క రూపాయికే పర్యావరణ గణపతి ప్రతిమల పంపిణీ ప్రారంభించింది. చిన్నా, పెద్ద పరిమాణంలో, విభిన్న ఆకృతులలో మట్టి గణపతులను ఏటేటా ప్రజల వద్దకు తెస్తోంది. వనస్థలిపురంలోని రామాలయం ప్రాంగణం కేంద్రంగా మట్టి విగ్రహాలను అందుబాటు ధరల్లో మండప నిర్వాహకులు, అపార్ట్‌మెంట్ వాసులు, గృహస్తులకు అందజేస్తోంది. తమ వద్ద 6 అంగుళాల నుంచి 6 అడుగుల విగ్రహాలు, రూ. 40 నుంచి రూ. 20 వేల ధరల్లో లభ్యవుతాయని సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు 8686259007 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

కడ్తాల్: గ్రామదేవతల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. శనివారం ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10న బీరప్ప, పెద్దమ్మ, ఈదమ్మ, మైసమ్మ, మడేలు బోనాలు, 11న పోచమ్మ బోనాలు 12వ తేదీ రేణుక ఎల్లమ్మ బోనాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను చాటే బోనాల ఉత్సవాలను ఐక్యమత్యంతో నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, సభ్యులు రాములు, మల్లేశ్‌గౌడ్, రాంచందర్ నాయక్, యాదయ్య, నర్సింహ, రవి తదితరులు పాల్గొన్నారు.